సాక్షి
కాకినాడ
శనివారం । 19 । ఏప్రిల్ । 2025



నరకం వయా బరకం!

రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులపై రైతులు రాత్రి వేళ నల్లబరకాలు కప్పి, వాటిపై రాళ్లు పెడుతున్నారు. వాటిని ఢీకొని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.


10లో



నైవేద్య నారాయణులు

ప్రభుత్వాసుపత్రికి వైద్యానికి వెళ్తే.. అక్కడి వైద్యులు ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేస్తున్న విషయం.. శస్త్రచికిత్స చేసిన ఓ రోగి మృతితో బట్టబయలైంది.

సాగుకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.10 అడుగులకు చేరింది.

క్రీస్తు త్యాగం.. సమస్త మానవాళికీ స్ఫూర్తిదాయకం



కాకినాడ రూరల్ పండూరులో జాక్సన్ మినిస్ట్రీస్ పెంతుకోస్తు ప్రార్థన మందిరం ఆధ్వర్యాన సాగిన ఏసుక్రీస్తు సిలువ యాత్ర

ప్రేమ, కరుణ, క్షమ, సహనం, త్యాగం వంటి సద్గుణాలను ప్రబోధించిన దైవ కుమారుడైన ఏసు క్రీస్తు సిలువ మరణం పొందిన రోజును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే నిర్వహించుకున్నారు. పలు ప్రాంతాల్లో సిలువ యాత్రలు నిర్వహించారు. అలనాడు క్రీస్తును ముళ్ల కొరడాలతో కొట్టి, రక్తం చిందింపజేసి.. సిలువ వేసిన సన్నివేశాలను కళ్లకు కట్టేలా ఈ యాత్రలు సాగాయి. నాడు క్రీస్తు అనుభవించిన బాధలను, శ్రమలను వీక్షకుల గుండెలు బరువెక్కే రీతిలో ప్రదర్శించారు. యాత్రల అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్లు, పాస్టర్లు మాట్లాడుతూ, పాప మార్గంలో పయనిస్తున్న సమస్త మానవాళినీ రక్షించేందుకే.. లోక రక్షకుడైన ఏసుక్రీస్తు సిలువపై ప్రాణ త్యాగం చేశారని అన్నారు. ఆయన త్యాగం ప్రపంచ మానవాళికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ కరుణ, ప్రేమ, క్షమ, సహనం వంటి సద్గుణాలను అలవరచుకోవాలన్నదే క్రీస్తు సందేశమని తెలిపారు.

– కాకినాడ రూరల్/కరప



కరప మండలం యండమూరు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల సందడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం కిక్కిరిసిపోయింది. సెలవు రోజు కావడంతో సత్యదేవుని దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీనికితోడు గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై, ఇతర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు. ఆలయంలో ఎక్కడ చూసినా నవదంపతులే దర్శనమిచ్చారు. వీరందరూ సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు, వ్రత, విశ్రాంత మండపాలన్నీ నవదంపతులు, వారి బంధుమిత్రులతో కిక్కిరిసిపోయాయి. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది స్వామివారిని దర్శించి, పూజలు చేశారని అధికారులు తెలిపారు. వ్రతాలు 2 వేలు జరిగాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట సమయం పట్టింది. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్నప్రసాదాన్ని 5 వేల మంది భక్తులు స్వీకరించారు.

పరిశ్రమల్లో వాటిల్లే ప్రమాదాలపై అవగాహన

కాకినాడ క్రైం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన శుక్రవారం పరిశ్రమల్లో వాటిల్లే ప్రమాదాలపై ఆ శాఖ అవగాహన కల్పించింది. జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి ఉద్దండురావు సుబ్బారావు ఆధ్వర్యాన వాకలపూడిలోని ఓ చమురు కంపెనీలో అవగాహన ప్రదర్శన చేపట్టారు. ప్రమాదవశాత్తూ వాటిల్లే అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాల నుంచి బయటపడే మెళకువలను సిబ్బందికి వివరించారు. పై అంతస్తుల్లో ఉన్న వారిని రక్షించి, తరలించే ప్రక్రియను డెమో ద్వారా చూపించారు. ఫైర్ ఎక్స్టింగ్విషర్లను వినియోగించే విధానాన్ని తెలియజేశారు. పరిశ్రమల్లో వెలువడే రసాయన వ్యర్థాల నిర్వహణతో పాటు, వాటి వలన ముప్పు వాటిల్లకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్యాస్ ప్రమాదాల నివారణపై కూడా డెమో ఇచ్చారు. రసాయన వాయువులు వెలువడితే తమతో పాటు సహోద్యోగులను కాపాడే సాహసోపేత ప్రక్రియలను వివరించారు.

'సీతమ్మను రాముడు ఎన్నడూ శంకించలేదు'



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'రామాయణాన్ని చదవని వారు, రామతత్వాన్ని అర్థం చేసుకోని వారు సీతమ్మను రాముడు పరిత్యజించడాన్ని విమర్శిస్తారు. రాముడు ఎన్నడూ సీతమ్మను శంకించలేదు' అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగం ఆధ్వర్యాన ఉత్తరకాండపై నాలుగో రోజు ప్రవచనాన్ని స్థానిక టి.నగర్ హిందూ సమాజంలో శుక్రవారం ఆయన కొనసాగించారు. 'భర్తృ ధర్మం వేరు, రాజధర్మం వేరు. రాముడు రాజధర్మానికి కట్టుబడిన పాలకుడు. భద్రునితో తనను గురించి ప్రజలు మాట్లాడుకుంటున్న శుభాశుభాలు రెండూ తెలుసుకోవాలని రాముడు స్పష్టం చేశాడు. మన రాముడు సాగరంపై సేతువు నిర్మించి, రావణుని వధించి, దుష్కరమైన పని చేశాడు. కానీ, రావణుని స్పర్శ తగిలిన సీతమ్మను రాముడు ఎలా ఏలుకుంటున్నాడని ప్రజలు అనుకుంటున్నారని భద్రుడు చెబుతాడు. ఆదర్శవంతమైన పాలకుడు వ్యక్తిగత జీవితంలో కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి' అని సామవేదం వివరించారు. 'ఒక వ్యక్తి కీర్తి ఎంత కాలం ఈ లోకంలో ఉంటుందో, అంత కాలం ఆ వ్యక్తి ఉన్నత లోకాల్లో ఉంటాడు. ప్రతి ఒక్కరూ అపకీర్తి సోకకుండా తమను తాము రక్షించుకోవాలి. లోకాపవాదు అత్యంత బాధాకరమైనది. కానీ లోకాపవాదాన్ని తొలగించుకోవాలి. రాముడు 11 వేల సంవత్సరాలు పరిపాలిస్తే, అప్పటికే 9 వేల సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పటి వారు సీతమ్మ అగ్నిప్రవేశాన్ని నమ్మకపోయి ఉండవచ్చు. అపవాదు పట్ల రాముడు ఎంతగానో దుఃఖించాడు. సీతాపరిత్యాగమే తన కర్తవ్యమన్న నిర్ణయానికి వచ్చాడు. ఎవరో ఒక అనామకుడు చెబితే సీతమ్మను ఆయన పరిత్యజించలేదు. ఈ సందర్భంగా మనకు లవకుశ సినిమా గుర్తు రావచ్చు. ఆ సినిమా ప్రారంభంలోనే పద్మ పురాణాంతర్గతమైన కథను అనుసరించి సినిమాను రూపొందించినట్టు పేర్కొన్నారు. వివిధ కల్పాల్లో రామాయణ గాథ జరిగింది. వైవస్వత మన్వంతరంలోని కథను వాల్మీకి మహర్షి మనకు ప్రసాదించారు. స్థూల ధర్మం వేరు, సూక్ష్మ ధర్మం వేరు' అని సామవేదం వివరించారు.

పప్పు ఉడకట్లే..





రేషన్ వాహనం ద్వారా లబ్ధిదారులకు బియ్యం ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్ (ఫైల్)

- కోటాలో కూటమి సర్కారు కోతలు
- 10 నెలలుగా అందని కందిపప్పు
- జిల్లాలో 6.53 లక్షల రేషన్ కార్డులు
- లబ్ధిదారులకు 650 టన్నుల పప్పు అవసరం
- ఇస్తున్నది 200 టన్నుల్లోపే..
- కార్డుదారుల్లో అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: చెబుతున్న మాటలకు, చేస్తున్న పనులకు పొంతన లేని రీతిలో కూటమి పాలన సాగుతోంది. ఎన్నికల ముందు సూపర్–6 హామీలతో ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కాక వాటిని గాలికొదిలేశారు. ఇచ్చిన హామీల మాట దేవుడెరుగు, ప్రతి నెలా క్రమం తప్పకుండా నిరుపేదలకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకుల్లో కూడా సర్కారు కోతలు పెడుతోంది. ఇందులో భాగంగానే రకరకాల సాకులతో ఈ–కేవైసీని తెరపైకి తీసుకుని వచ్చిందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ–కేవైసీకి, నిత్యావసరాల పంపిణీకి ఉన్న సంబంధమేమిటో అర్థం కాక లబ్ధిదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారం ఆధార్‌తో అనుసంధానమైందని, అటువంటప్పుడు ఈ–కేవైసీ ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రేషన్ బియ్యం, పంచదార, కందిపప్పు వంటి నిత్యావసరాలను తమకు దూరం చేసేందుకే ప్రభుత్వం ఇటువంటి విధానాలు అమలు చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

పది నెలలుగా పప్పు

మరోవైపు పది నెలల పాలనలో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ఏ ఒక్క నెలలోనూ పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా చేయడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కిలో కందిపప్పు రూ.67కే ప్రతి రేషన్‌కార్డుదారుకు ప్రతి నెలా అందించేవారు. ప్రస్తుతం అలా ఇవ్వకపోవడంతో గత్యంతరం లేక కిలో కందిపప్పును బయటి మార్కెట్లో రూ.160 నుంచి రూ.180 వరకూ వెచ్చించి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో పేదలకు నాణ్యమైన నిత్యావసరాలు సరఫరా చేస్తున్నామని గొప్పగా ప్రకటించుకున్నారు. తీరా చూస్తే క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. జిల్లాలో 6,53,715 రేషన్‌కార్డులున్నాయి. ఈ లబ్ధిదారులందరికీ ప్రతి నెలా 650 టన్నుల కందిపప్పు అవసరం. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క నెలలోనూ ఇందులో 50 శాతం కూడా విడుదల చేసిన దాఖలాలు లేవు. అధికారిక లెక్కల ప్రకారం గత నెలలో 200 టన్నుల కందిపప్పు సరఫరా చేశారు. కానీ, జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో ఈ నెల కందిపప్పు అందుకున్నామని అంటున్న వారే లేరు. కందిపప్పు విడుదల చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న మాటలు నమ్మి ఎంతో ఆశతో రేషన్ వాహనాల వద్దకు వెళ్తే పరిస్థితి వేరేలా ఉంటోంది. కందిపప్పు విడుదల చేస్తున్నామని మంత్రులు చెబుతూంటే మీరు లేదంటున్నారేమిటని రేషన్ వాహనాల ఆపరేటర్లను ఎవరైనా ప్రశ్నిస్తే.. పై నుంచి తమకు కందిపప్పు ఇవ్వడం లేదు, రేషన్ బియ్యం తీసుకుని వెళ్లండనే జవాబు ఎదురవుతోంది. దీంతో ఏం చేయాలో తెలియక కార్డుదారులు రేషన్ బియ్యం తీసుకుని వెనుతిరుగుతున్నారు. సంక్షేమ పథకాలు పక్కాగా అమలు చేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి భిన్నంగా నేటి పాలకులు వ్యవహరిస్తున్నారని జనం దుమ్మెత్తిపోస్తున్నారు.

ఎవ్వరికీ అందడం లేదు



ప్రతి నెలా రేషన్ తీసుకునే ఎండీయూ వాహనం, రేషన్ షాపు వద్ద ఈ నెల కందిపప్పు రాలేదనే చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలైనప్పటికీ ఎవ్వరికీ కందిపప్పు సక్రమంగా అందడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా రేషన్ బియ్యంతో పాటు, కందిపప్పు, పంచదార ఇచ్చేవారు. ఇప్పుడు ఇవి రెండూ అప్పుడప్పుడు మాత్రమే ఇస్తున్నారు.

– నల్ల రాణి, వాకలపూడి, కాకినాడ రూరల్

ఒక్కసారి కూడా ఇవ్వలేదు



కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలైంది. ఒక్క నెలలో కూడా నాకు కందిపప్పు ఇవ్వలేదు. పేదలమైన మాపై కూటమి ప్రభుత్వం విషం చిమ్ముతోంది. ఇప్పుడేమో ఈ–కేవైసీ సాకుతో రేషన్‌లో కోత పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా పేదలకు ఇచ్చే రేషన్‌లో కోత పెట్టకుండా ప్రతి నెలా బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, ఇతర నిత్యావసర సరకులు ఇవ్వాలి.

– పోకనాటి ప్రభాకరమూర్తి, కాకినాడ

బయట కొనాల్సిన దుస్థితి



అధికారంలోకి అన్నీ డబుల్ చేసి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ప్రతి నెలా ఇచ్చిన కందిపప్పు రేషన్ వాహనాల్లో ఇవ్వడం లేదు. దీంతో కందిపప్పు బయట కొనుగోలు చేసుకోవలసిన దుస్థితి ఏర్పడుతోంది. పేదలకు పౌష్టికాహారంగా ఉపయోగపడే కందిపప్పును రేషన్ ద్వారా ఇవ్వకపోవడం దారుణం.

– కర్రి వెంకటలక్ష్మి, టిడ్కో గృహ సముదాయం, సామర్లకోట

స్టాక్ రావడం లేదంటున్నారు



గత ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా రేషన్ వాహనం ద్వారా బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు అందజేసేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో బియ్యం ఇస్తున్నారు. పంచదార అరకొరగా ఇస్తుండగా, కందిపప్పు అప్పుడప్పుడు కనిపిస్తోంది. గత నెల పంచదార కూడా ఇవ్వలేదు. కందిపప్పు ఊసే లేదు. డీలర్లను, రేషన్ వాహనదారులను అడిగితే పై నుంచి స్టాక్ రావడం లేదని చెబుతున్నారు. చేసేది లేక బియ్యం మాత్రమే తీసుకుని వెళ్తున్నాం.

– ఎస్ఎస్ రామ్‌కుమార్, కిర్లంపూడి

కానరాని పెళ్లి సందడి



- వచ్చే నెల 7 నుంచి సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలు
- గడువు సమీపిస్తున్నా కానరాని ఏర్పాట్లు
- పోస్టర్ ఆవిష్కరణతో సరి
- సమన్వయ కమిటీ సమావేశం ఊసే లేదు

అన్నవరం: దేవుని పెళ్లంటే ఊరంతా సంబరమే. ఎక్కడ చూసినా సందడే. చిన్నపాటి ఆలయమే అయినా.. దేవుని కల్యాణానికి నెల రోజుల ముందు నుంచే సన్నాహాలు మొదలవుతాయి. అటువంటిది రాష్ట్రంలోని అతి గొప్ప క్షేత్రాల్లో ఒకటైన అన్నవరం సత్యదేవుని కల్యాణమంటే ఇంకెంత సందడి ఉండాలి..! సన్నాహాలు ఎంత జోరుగా సాగాలి..! కానీ, సత్యదేవుని కల్యాణోత్సవానికి గడువు సమీపిస్తున్నా.. దేవస్థానంలో అటువంటి సందడే కనిపించడం లేదు.

కనీసం సమీక్ష కూడా లేదు

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాలు వచ్చే నెల 7వ తేదీన ప్రారంభం కానున్నాయి. దీనికి ఇక 17 రోజులు మాత్రమే గడువుంది. ఈ ఉత్సవాల నిర్వహణపై ఈపాటికే సన్నాహాలు మొదలైపోవాలి. గతంలో నెల రోజుల ముందే సమన్వయ శాఖల సమావేశాలు, వరుస సమీక్షలు నిర్వహించే వారు. రత్నగిరిపై కల్యాణోత్సవ పనులు జోరుగా జరిగేవి. ఎందుకో కానీ, కల్యాణ ఘడియలు సమీపిస్తున్నా ఈ ఏడాది అసలు ఉత్సవ ఏర్పాట్లే ఆరంభం కాలేదు. ఆలయ ప్రాంగణంలో రంగులు మాత్రమే వేస్తున్నారు. ఈ నెల 30న జరగనున్న సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం ఏర్పాట్లపై దేవదాయ శాఖ మంత్రి, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ తదితరులు గత బుధవారం సమీక్షించారు. కానీ, ఈ చందనోత్సవానికి వారం రోజుల తరువాత జరిగే సత్యదేవుని కల్యాణోత్సవాలపై ఇప్పటి వరకూ ఎటువంటి సమీక్షా నిర్వహించలేదు. దేవస్థానం సిబ్బందితో ఈఓ వీర్ల సుబ్బారావు కేవలం ఒక్కసారి సమావేశమయ్యారు. శ్రీరామ నవమి నాడు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కల్యాణోత్సవాల నిర్వహణలో దేవస్థానంతో పాటు, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య, జిల్లా ప్రజా రవాణా (ఆర్టీసీ) తదితర శాఖలు పాలు పంచుకుంటాయి. ఆయా అధికారులతో ఈపాటికే సమన్వయ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఇప్పటి వరకూ ఆ ఊసే లేదు.

చీఫ్ ఫెస్టివల్ అధికారి అవసరం

రాష్ట్రంలో విజయవాడ కనకదుర్గమ్మవారి దసరా ఉత్సవాలు, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి చందనోత్సవం, శ్రీశైలంలో మహాశివరాత్రి, కార్తిక మాసం, శ్రీకాళహస్తి, కాణిపాకం ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖలో అనుభవజ్ఞులైన అధికారులను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమిస్తున్నారు. అన్నవరం దేవస్థానంలో ఇప్పటి వరకూ అనుభవజ్ఞులైన అధికారులే ఈఓలుగా ఉండటంతో ప్రత్యేకాధికారులను నియమించడం లేదు. ప్రస్తుత ఈఓకు దేవస్థానం వ్యవహారాలు, ఉత్సవాల నిర్వహణలో అంత అనుభవం లేదు. ఈ ఏడాది కల్యాణోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉంది. అలాగే, రథోత్సవానికి కూడా గిరి ప్రదక్షిణ స్థాయిలో భక్తులు వచ్చే అవకాశముందని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కొన్నాళ్లుగా దేవస్థానంలో జరుగుతున్న వివాదాస్పద పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకాధికారిని నియమించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఆలయానికి రంగులు అద్దుతున్న దృశ్యం

ముసుగు వీడని రథం

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా మే 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే రథోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. దీని కోసం గత ఏడాది రూ.1.08 కోట్లతో భారీ టేకు రథం నిర్మించారు. గతంలో సత్యదేవుని ఊరేగింపు వాహనాల్లో అత్యంత పెద్దది రావణబ్రహ్మ వాహనమే అతి పెద్దదిగా ఉండేది. ఇది సుమారు 20 అడుగుల ఎత్తు, 15 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పున ఉంటుంది. ఈ వాహనంపై సత్యదేవుని ఊరేగింపును వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఈ రావణబ్రహ్మ వాహనం కన్నా టేకు రథం దాదాపుగా రెట్టింపు సైజులో ఉంటుంది. దీని ఎత్తు 35.8 అడుగులు. వెడల్పు 14.6 అడుగులు. పొడవు 21 అడుగులు. ఈ రథానికి ఆరడుగుల ఎత్తున ఆరు చక్రాలున్నాయి. అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ రథం ఎత్తు 38 అడుగులు కాగా, దీని కంటే సత్యదేవుని టేకు రథం 2.4 అడుగులు మాత్రమే చిన్నది. ఈ రథానికి ఆకర్షణీయమైన రంగులు, ముందు భాగంలో గుర్రాల బొమ్మలు, చక్రాలకు హైడ్రాలిక్ బ్రేకులు ఏర్పాటు చేశారు. గత ఏడాది కల్యాణోత్సవాల సందర్భంగా ఈ రథం ట్రయల్ రన్ సమయంలో చాలా ఇబ్బంది పడ్డారు. ఇంత ఎత్తు రథాన్ని మిట్టపల్లాలుగా ఉండే అన్నవరం మెయిన్ రోడ్డులో లాగడం చాలా కష్టం. ఏ ఇబ్బంది వచ్చినా అదుపు చేయడానికి జేసీబీ రక్షణగా ఉండాలి. గత ఏడాది అప్పటి ఈఓ, ప్రస్తుత దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నిపుణులు, ఇంజనీరింగ్, ఇతర సిబ్బంది సహకారంతో ట్రయల్ రన్, తరువాత రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈ రథాన్ని పంపా సత్రంలో ముసుగు కప్పి ఉంచారు. అప్పటి నుంచీ ఆ రథం ఎలా ఉందో ఏ ఒక్కరూ పట్టించుకోనే లేదు. ఈ ఏడాది కాలంలో ఒక్కసారి కూడా రథం ముసుగు తీయలేదు. ప్రస్తుతం కల్యాణోత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ఈ రథానికి ట్రయల్ రన్ నిర్వహించాల్సి ఉంది. దీని ఫిట్‌నెస్‌ను నిపుణులతో పరీక్షించాలి. అటువంటి పనులు ఇంత వరకూ మొదలు కాలేదు. రథాన్ని నేల పైనే ఉంచడంతో దాని చక్రాలకు చెదలేమైనా పట్టాయా.. పడితే ఏం చేయాలనేది కూడా పరిశీలించలేదు.



భారీ టేకు రథంపై సత్యదేవుని ఊరేగింపు (ఫైల్)

వేట నిషేధ భృతికి మత్స్యకారుల గుర్తింపు



కాకినాడ కుంభాభిషేకం వద్ద పేర్లు నమోదు చేయించుకుంటున్న మత్స్యకారులు

కాకినాడ రూరల్: ఈ నెల 15 నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమలులోకి రావడంతో వేట నిషేధ భృతి అందజేసేందుకు మత్స్యకారుల గుర్తింపు ప్రక్రియను అధికారులు శుక్రవారం చేపట్టారు. ఈ ప్రక్రియను దాదాపు ఒకే రోజులో పూర్తి చేసే లక్ష్యంతో ఉదయమే ఎన్యూమరేషన్ మొదలు పెట్టారు. జిల్లాలో సుమారు 4,600 బోట్లు ఉండగా సుమారు 24 వేల మంది గంగపుత్రులు లబ్ధి పొందనున్నారు. బోటు యజమాని తన బోటుపై వేట సాగించే మత్స్యకారులు జాబితాను, వారి ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను మత్స్యశాఖ అధికారులకు అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకే 3,725 బోట్లకు సంబంధించిన మత్స్యకారులు గుర్తింపు పూర్తి చేశారు. మిగిలిన వారిని శనివారం గుర్తిస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు తెలిపారు. గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యాక ఆన్‌లైన్‌లో వివరాలు అప్‌లోడ్ చేసి, 21న సోషల్ ఆడిట్ వివరాలు వెల్లడించనున్నారు. 22న అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం, సవరణలు చేసి 23న మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయానికి జాబితా అందజేస్తారు. ఈ నెల 26న వేట నిషేధ భృతిని మత్స్యకారుల ఖాతాలకు జమ చేయనున్నారు. దీనిని అర్హులైన అందరికీ వర్తింపజేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నరకం వయా బరకం!

- ధాన్యపు రాశులపై కప్పుతున్న రైతులు
- నల్లవి కావడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులకు కనపడని పరిస్థితి
- ప్రాణాలు కోల్పోతున్న వాహన చోదకులు
- అన్నదాతకు అవగాహన కల్పించాలని పోలీసులను కోరుతున్న ప్రజలు


దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద రోడ్డులో ఆరబెట్టిన ధాన్యపు రాసులు


దేవరపల్లి మండలం దుద్దుకూరు–గౌరీపట్నం గ్రామాల మధ్య హైవే సర్వీసు రోడ్డులో వేసిన ధాన్యపు రాసులు

దేవరపల్లి: రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం రాశులు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. పగలంతా రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని రాత్రి సమయంలో అక్కడే రాశులుగా వేసి వాటిపై నల్లబరకాలు కప్పుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు ఆ రాశులను ఢీ కొని ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అనేక మంది ఇలా ప్రమాదాలపాలై తీవ్రగాయాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో ఈ విధమైన ప్రమాదాల్లో సుమారు 10 మంది గాయపడినట్టు సమాచారం. ఇటీవల గౌరీపట్నం వద్ద స్కూటీపై వెళుతున్న భార్యాభర్తలు ధాన్యం రాశులను ఢీ కొని తీవ్రంగా గాయపడ్డారు. కొవ్వూరు నుంచి గోపాలపురం వెళ్తున్న పోస్టల్ ఉద్యోగి దుద్దుకూరు వద్ద రాత్రి సమయంలో ధాన్యపురాశిని ఢీ కొని గాయపడ్డారు. ఈ విధంగా వెలుగుచూడని ప్రమాదాలు ఎన్నో జరుగుతున్నాయి. ధాన్యం రాశులపై నల్ల బరకాలు కప్పడం వల్ల రాత్రి సమయంలో ప్రయాణికులకు కనపడక వారు వాటిని ఢీకొని ప్రమాదాల పాలవుతున్నారు. కొన్నిచోట్ల ధాన్యపు రాశుల చుట్టూ పెద్ద రాతి బండలను పెడుతున్నారు. వాటి వల్ల కూడా వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. రోడ్డుపై గల ధాన్యం రాశుల వద్ద కనీసం ఎటువంటి హెచ్చరిక బోర్డులు పెట్టక పోవడం బాధ్యతా రాహిత్యమే. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై ఆరబెడుతున్న ధాన్యం రాశుల వద్ద సూచకలు ఏర్పాటు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, రోడ్డు మధ్యలో ధాన్యపు కుప్పలు వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్‌లో నల్లజర్ల, దేవరపల్లి, కొవ్వూరు మండలాల్లోని రైతులు గుండుగొలను–కొవ్వూరు 16వ జాతీయరహదారి సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబెట్టి ఒబ్బిడి చేసుకుంటుంటారు. పొలాల్లో ధాన్యం ఆరబెట్టుకోవడానికి కళ్లాలు లేక రోడ్డుపైనే ధాన్యాన్ని ఆరబెడతారు. హైవేకు ఇరువైపుల గల సర్వీసు రోడ్లు ధాన్యంతో నిండి ఉంటున్నాయి. రాసులకు తెల్లబరకాలు కప్పి, రాళ్లు పెట్టకుండా సూచక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు అధికారులను కోరుతున్నారు. మండలంలోని కృష్ణంపాలెం వద్ద గురువారం రాత్రి ధాన్యపు రాశిని ఢీ కొని యువకుడు మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. రాత్రి సమయంలో సర్వీసు రోడ్డులో వెళ్లాలంటే ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

కనుమరుగైన వరికుప్పలు

పొలాల్లో వేసే వరికుప్పలు కనుమరుగయ్యాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్వం పొలంలోనే కుప్పగా వేసి సీతాకాలంలో పంటకు గిట్టుబాటు ధర పలికినప్పుడు కుప్పలను మసూళ్లు చేసి విక్రయించేవారు. దాదాపు ఆరు నెలలు ధాన్యం కుప్పలో ఉండి ధాన్యం రుచికరంగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా పొలాల్లో కనుచూపు మేర వరికుప్పలు కనిపించేవి. పంటను కూలీలతో కోయించి పనలపై ఆరబెట్టి కుప్పలు వేసే వారు. సాంకేతిక వ్యవసాయ పద్ధతులు మారడం, యంత్రాలు అందుబాటులోకి రావడంతో యంత్రాలతో ధాన్యాన్ని కోసి ఎప్పటి ధాన్యాన్ని అప్పుడే రోడ్లపై ఆరబెట్టి వ్యాపారులకు విక్రయించి రైతులు సొమ్ము చేసుకుంటున్నారు. ధాన్యం రైతులు రహదారులనే కళ్లాలుగా వినియోగించుకుంటున్నారు. పండించిన పంటలను ఆరబెట్టుకోవడానికి గ్రామాల్లో ప్రభుత్వం యార్డులు ఏర్పాటు చేసి బరకాలు రాయితీపై అందజేయాలని రైతులు కోరుతున్నారు.

హైవే అధికారుల దృష్టికి తీసుకువెళతా

గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారి (16) సర్వీసు రోడ్లపై వేస్తున్న ధాన్యపు రాశులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి వల్ల రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. దేవరపల్లి మండలంలో సూర్యనారాయణపురం నుంచి గౌరీపట్నం వరకు హైవేకు ఇరువైపులా గల సర్వీసు రోడ్లపై రైతులు ధాన్యం రాసులు వేస్తున్నారు. రాసులపై నల్లబరకాలు కప్పడం వల్ల రాత్రి సమయంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. హైవే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాము. – వి.సుబ్రహమణ్యం, ఎస్సై, దేవరపల్లి



ధాన్యపురాశిని ఢీకొని యువకుడి మృతి

- రాత్రి వేళ రాకపోకలు లేక ఎవరూ గుర్తించని పరిస్థితి
- తెల్లవారు జామున 3 గంటల వరకు రోడ్డుపైనే పడిఉన్న వైనం
- హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించి పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ


కృష్ణంపాలెం వద్ద హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వీరవెంకటరమణ

దేవరపల్లి: రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం రాసులను ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం మండలంలోని కొత్తగూడేనికి చెందిన పుట్టా వీరవెంకటరమణ(30) గురువారం సాయంత్రం యర్నగూడెంలోని తన తండ్రి వద్దకు వెళ్లాడు. తండ్రితో మాట్లాడి అర్ధరాత్రి సమయంలో తిరిగి గుండుగొలను–కొవ్వూరు 16వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో బైక్‌పై వస్తుండగా, రోడ్డుపై ఆరబెట్టి ఉన్న ధాన్యం రాశులను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వీర వెంకటరమణ రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయం తగిలింది. అయితే అర్ధరాత్రి సమయం కావడం, ఆ సమయంలో అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న వీరవెంకటరమణను ఎవరూ చూడలేదు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది గమనించి స్థానిక పోలీసుల సహకారంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. అపస్మారక స్థితిలో ఉన్న వీరవెంకటరమణను గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సత్యనారాయణ తల్లి ఏడాది క్రితం మృతి చెందగా, తండ్రి ఉన్నారు. తండ్రి యర్నగూడెంలో ఉంటుండగా, వెంకటరమణ కొత్తగూడెంలో ఉంటున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి. సుబ్రహ్మణ్యం తెలిపారు.

నైవేద్య నారాయణులు

- ప్రభుత్వ వైద్యానికి వస్తే ప్రైవేటు ఆస్పత్రులకు సిఫారసు
- అక్కడ అన్నీ తామై రోగులకు చికిత్స
- శస్త్ర చికిత్స వికటించి రోగి మృతితో బండారం బట్టబయలు
- విచారణ చేస్తున్న ఉన్నతాధికారులు


రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాల

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పేదవాడికి సుస్తీ చేస్తే వచ్చే మొదటి ఆలోచన ప్రభుత్వ వైద్యం. పూర్తిగా నయం కాకపోయినా తత్కాంతి జరుగుతుందనే ఆశ. అక్కడ కూడా వారికి టేక్ డైవర్షన్ అంటూ ప్రైవేటు వైద్యానికి దారిచూపే పరిస్థితి ఎదురైతే వారిని ఆదుకునేదెవరు? ఆ దారిచూపేది కూడా అక్కడి వైద్యుడే అయితే? ప్రసాదాలు ప్రభుత్వాస్పత్రికి.. గిన్నిలో వండిన మొత్తం నైవేద్యం తన జేబులోకి అన్నట్టుంది రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో పరిస్థితి. ఈ ఆస్పత్రిలో అందేది అరకొర వైద్యమేనన్నది బహిరంగ రహస్యం. ఆర్థికంగా ఓ మోస్తరుగా తట్టుకోగలరన్న రోగులను గుర్తించి ఈ ఆస్పత్రిలో వసతుల లేమిని బూచిగా చూపి ప్రైవేటు వైద్యానికి సిఫారసు చేస్తూ ఫలానా ఆస్పత్రికి వెళ్లండి.. అక్కడ వసతులు బాగుంటాయి.. అక్కడికి నేనే వచ్చి వైద్యం చేస్తానని పంపుతూ నిలువునా వారిని దోచుకుంటున్నారు. పేదలకు వైద్యం చేసేందుకు ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటూ పేదల జేబులు గుల్ల చేస్తున్న ఇటువంటి వారిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

అతిథిగా ఇక్కడ.. అతిగా అక్కడ..

రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో వైద్యులు సమయపాలనకు బహుదూరం. ఇక్కడికి అతిథిలా వచ్చి ఏవో తోచినన్ని కేసులు చూసి, ప్రైవేటు కన్సల్టెంట్లుగా అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇక్కడ ఉన్న కొద్ది సేపటిలోనే రోగుల స్థితిగతులు గుర్తించడం లేనిపోని అనారోగ్య సమస్యలు చెప్పి వారిని భయపెట్టి ఇక్కడ వసతులు లేవు ఫలానా ఆస్పత్రికి వెళ్లండని చెప్పడం. అక్కడ ఈ వైద్యుడే వారికి వైద్యం చకచకా కార్యాచరణలోకి దిగిపోతున్నారు. ప్రభుత్వాసుపత్రిలో తీయించిన రిపోర్టులతోనే వారు అనుకున్న మొత్తానికి వైద్యం, బిల్లు చేయించి సదరు ప్రైవేటు యాజమాన్యంతో భాగస్వామ్య పంపకాలు జరిగిపోతున్నాయి.

ఉచిత సలహాలు ఇక్కడ.. ఖరీదైన మందులు అక్కడ..

ప్రభుత్వ ఆసుపత్రిలో న్యూరో, ఆర్థో, ట్రామా తదితర విభాగాల్లో రోజుల తరబడి చికిత్స పొందుతున్న రోగులకు ఆయా విభాగాల్లోని కొందరు వైద్యులు మెరుగైన ఫలితాలకు మంచి మందులు వాడాలని రోగికి, బంధువులకు ఉచిత సలహాలిస్తుంటారు. అసలే రోగభయంతో ఉన్న రోగులు, వారి బంధువులు వాటి గురించి ప్రశ్నిస్తారు. వెంటనే సదరు వైద్యుడు ఆ మందుల ఏజెంట్ తనకు తెలుసునని, తక్కువకు ఇప్పిస్తానని నమ్మబలికి వెంటనే సదరు ఏజెంటును పిలిపించి వారికి కావలసిన మందులు ఇప్పించి కమీషన్లతో జేబులు నింపుకొంటున్నారు. మరి కొందరు వైద్యులు తమతో ఆర్థిక లావాదేవీలున్న కొన్ని మందుల దుకాణాల్లో లభించే మందులనే రోగులకు రాసి, ఫలానా దుకాణంలో మాత్రమే కొనుగోలు చేయండని చెప్పి తద్వారా 20 శాతం కమీషన్ పొందుతున్నారు.

వైద్యం వికటించి బయటపడిన భాగోతం

సాధారణంగా ప్రభుత్వాసుపత్రి వైద్యులు చేస్తున్న నిర్వాకాలపై రోగుల నుంచి ఫిర్యాదులు అందడం తక్కువ. తమ ప్రాణానికి ఏమౌతుందో అన్న ఆందోళన, వైద్యులపై ఫిర్యాదు చేస్తే వైద్యం సరిగ్గా చేయరన్న భయంతో రోగులు ఫిర్యాదులకు వెనకడుగు వేస్తారు. ఈ నెల ఏడో తేదీన ఆలమూరుకు చెందిన గుమ్మిశెట్టి సత్యనారాయణ ట్రాక్టర్ నుంచి పడి కాళ్లు పూర్తిగా నుజ్జుకావడంతో ప్రభుత్వాసుత్రికి తీసుకువచ్చారు. ఈ ఆసుపత్రిలో వైద్యుడు సూర్యతేజ అతనికి వైద్యం మొదలుపెట్టి ఇక్కడ ఉంటే సమస్య పరిష్కారం కాదని, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అక్కడ తాను వచ్చి సర్జరీ చేస్తానని సూచించారని అతడి బంధువు చెప్పారు. తన మంచికేనని నమ్మిన వెళ్లిన సత్యనారాయణకు దానవాయిపేటలోని హెలియోస్ ఆసుపత్రిలో సూర్యతేజ శస్త్ర చికిత్స చేశారు. శస్త్రచికిత్స విజయవంతమైందని, అబ్జర్వేషన్‌లో పెట్టామని, ఉదయానికి మెలకువ వస్తుందని అపుడు ఏమైనా పెట్టండని చెప్పి వెళ్లిపోయారు. మర్నాడు ఉదయం రోగి వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లగా చలనం లేని స్థితిలో శరీరం పూర్తిగా చల్లబడి ఉంది. ఆస్పత్రి వర్గాలు వచ్చి చూసేసరికి అతడు మృతిచెంది ఉన్నాడు. వైద్యం వికటించడం వల్లే రోగి మృతి చెందాడని బంధువులు ఆందోళన చేశారు. ఈ విషయం రాద్ధాంతమయ్యే సరికి వేళ్లన్నీ సూర్యతేజవైపు చూపాయి. దీంతో ఆయన నిర్వాకం బయటపడడంతో ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు.

ప్రభుత్వాస్పత్రిపై పర్యవేక్షణ అవసరం

రాజమహేంద్రవరం సమగ్ర ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో సమయం వెచ్చించేలా పర్యవేక్షణ జరగాలి. కొందరు వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ పెట్టి హాజరవుతున్నా ఆ తర్వాత బయట ఆసుపత్రుల్లో అటెండ్ అవుతున్నారు. ఒక వేళ ఎవరైనా సదరు వైద్యుడి కోసం ఆరా తీసినా రౌండ్స్‌లో ఉన్నట్టు చెప్తున్నారు. ఇటువంటి వాటిపై నిఘా పెట్టాలి.

గుండెపోటుతోనే మరణం

ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం, శస్త్రచికిత్స చేసింది నేనే. అయితే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన అతడిని ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేయలేదు. వాళ్లే వెళ్లారు. అతడికి శస్త్రచికిత్స విజయవంతంగానే జరిగింది. అతను గుండెపోటుతో మరణించాడు. తన వైద్యం వికటించి కాదు.

– డాక్టర్ సూర్యతేజ

మేం చెప్పేవరకూ పట్టించుకోలేదు



మా మావయ్యకు ప్రమాదం జరిగి ప్రభుత్వాసుపత్రికి వెళ్తే అక్కడ వైద్యుడు దానవాయిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకురమ్మని చెప్పారు. దీంతో సూర్యతేజ చెప్పినట్టుగానే తీసుకెళ్లాం. ఆపరేషన్ చేశాం, సక్సెస్ అన్నారు. తర్వాత నుంచి మనిషిని చూడలేదు. మర్నాడు ఉదయం ఐసీయూలోకి వెళ్లి చూస్తే శరీరం చల్లబడిపోయి ఉంది. వెంటనే భయంతో బయటకు వచ్చి అరిచాం. దీంతో అక్కడ ఉన్న నర్సులు వచ్చి చూశారు. అప్పటికే మా మావయ్య చనిపోయాడు.

– మృతుని కోడలు గుమ్మిశెట్టి వీర

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

స్వాధీనం చేసుకున్న ఆవులు గోశాలకు తరలింపు

నల్లజర్ల: ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, సమరసత ఫౌండేషన్ సభ్యులు గురువారం రాత్రి పట్టుకున్న గోవులను కోరుకొండ సమీపంలోని రామన్నపాలెం గోశాలకు అర్ధరాత్రి 3 గంటలకు తరలించారు. ఒడిశా రాష్ట్రం నవరంగ్ పూర్ నుంచి హనుమాన్ జంక్షన్ సంతకు కంటైనర్ లారీలో తరలిస్తున్న 85 గోవులను గురువారం రాత్రి పట్టుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం ఉత్తరాంధ్ర గోసంరణ కమిటీ అధ్యక్షుడు మెట్టుపల్లి సుబ్బారావు గోశాలకు వెళ్లి వాటి బాగోగులను పరిశీలించారు. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త గుంటుముక్కల రామకృష్ణ, తాడేపల్లిగూడెం గోశాల అధ్యక్షులు మద్దూరి విష్ణుమూర్తి, సవలం రామకృష్ణ తదితరులు గోవులను అప్పగించిన వారిలో ఉన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

ఒక వ్యక్తికి తీవ్రగాయలు

జగ్గంపేట: మండలంలోని ఒక రైసు మిల్లులో ఎలక్ట్రికల్ కెపాసిటర్ పేలి ఒక వ్యక్తి కళ్లు దెబ్బతిని, ముఖం కాలిపోయినట్లు తెలుస్తోంది. అయితే గాయపడిన వ్యక్తిని మిల్లు యాజమాన్యం వేరే ప్రాంతంలోని ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించగా తమ రైసు మిల్లులో ఎలాంటి ప్రమాదం జరగలేదని యాజమాన్యం చెప్పినట్లు ఎస్సై రఘునాథరావు తెలిపారు. ఈ సంఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదని అన్నారు. బాధితుడు విజయవాడ నుంచి వచ్చి సదరు రైసు మిల్లులో విద్యుత్ సంబంధ పనులు చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు చెపుతున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


బూల వెంకటరత్నం (ఫైల్)

మామిడికుదురు: స్థానిక 216వ నంబర్ జాతీయ రహదారిపై గో ఫ్రెష్ ఎదురుగా వాహనం ఢీ కొని పెదపట్నం లంక గెడ్డంవారిపేటకు చెందిన బూల వెంకటరత్నం (34) శుక్రవారం మృతి చెందాడు. విద్యుత్ సామాన్ల కోసం హోండా యాక్టివ్‌పై మామిడికుదురు వచ్చి ప్రమాదానికి గురయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. హైదారాబాదులోని సీఎంఆర్‌లో పని చేస్తున్న వెంకటరత్నం మూడు రోజులు సెలవులు రావడంతో శుక్రవారం ఉదయం స్వగ్రామం వచ్చి మృత్యువుపాలయ్యాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఏడేళ్ల క్రితం లక్ష్మీదుర్గతో అతడికి వివాహమైంది. అతనికి ఆరేళ్ల భరత్ శ్రీసాయి, రెండేళ్ల మాధురి లక్ష్మి సంతానం. వెంకటరత్నం మృతితో తాము జీవనాధారం కోల్పోయామని, ఇక తమకు దిక్కెవరంటూ అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. ఎస్సై చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రీ స్ట్రక్చర్ లెక్క తేలేనా?

- అధికారుల ఆదేశాలతో ఎంఈఓలు బిజీ
- వేకెన్సీ పొజిషన్, క్యాడర్ స్ట్రెంగ్త్‌పై కసరత్తు


క్యాడర్ స్ట్రెంత్, వేకెన్సీ పొజిషన్ లెక్క తేల్చే పనిలో నిమగ్నమైన ఎంఈవోలు, సాంకేతిక సిబ్బంది

రాయవరం: ఎంకి పెళ్లి సుబ్బిచావుకు వచ్చిందన్నట్లుగా ఉంది విద్యాశాఖ పరిస్థితి. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన 117 జీవో ప్రకారం 3, 4, 5 తరగతులను అవకాశం ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లను ఇవ్వాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం ఆ జీఓ తీసుకు వచ్చింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ జీవోకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఆయా తరగతులను తిరిగి పూర్వపు పాఠశాలలకు పంపించేందుకు రీ స్ట్రక్చర్ పేరుతో కసరత్తు చేస్తోంది. ఈ ప్రక్రియ ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్టు తయారైంది. ఇందులో భాగంగా పాఠశాలలను మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషన్ పాఠశాలలుగా విభజించారు. పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీనికి విద్యార్థులు కనీసం 60 మంది ఉండాలని నిర్ధారించారు. ఏదైనా గ్రామంలో మోడల్ స్కూల్ లేకుంటే కనీస రోల్ 45గా పరిగణించాలని సూచించారు. దీనికి ఎస్ఎంసీల తీర్మానాలు ఉండాలని ముడిపెట్టడంతో ప్రతి గ్రామంలో ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చిన పాఠశాలల ఎస్ఎంసీల నుంచి వ్యతిరేకత వచ్చింది. అలాగే రీ స్ట్రక్చర్ ప్రాతిపదికన 1, 2 తరగతులున్న ఫౌండేషన్ స్కూళ్లలో 1:30 నిష్పత్తి, బేసిక్ ప్రైమరీలో 1:20, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కనీసం ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. ఉన్నత పాఠశాలల్లో సెక్షన్లను పరిగణలోనికి తీసుకుని, ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ధారించారు. ఈ నిష్పత్తి ప్రకారం ఎంఈఓలు క్యాడర్ స్ట్రెంగ్త్‌ను, అదే సమయంలో వేకెన్సీ పొజిషన్‌ను లెక్క తేల్చే పనిలో పడ్డారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన

జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, రేషనలైజేషన్ తదితర అంశాలను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగానే చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్యాడర్ స్ట్రెంగ్త్, క్యాడర్ వారీగా ఖాళీల సంఖ్యను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా కాకినాడ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారులు కుస్తీ పడుతున్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సెలవు అయినప్పటికీ లెక్క తేల్చాలని అధికారులు ఆదేశించడంతో శనివారం నాటికి వాటిని సిద్ధం చేసేలా ఎంఈవోలు, సాంకేతిక సిబ్బంది కుస్తీ పడుతున్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి మృతి



కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొండేపూడి శ్యాంబాబు మాదిగ శుక్రవారం మరణించారు. 1994లో సమితి ఏర్పడిన తర్వాత 1995లో మందకృష్ణమాదిగ తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో కొండేపూడిని జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. అప్పటి నుంచి 30 ఏళ్ల పాటు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొని అనేకసార్లు జైలు జీవితాన్ని గడిపారు. కలెక్టరేట్ దగ్గర జరిగిన విధ్వంసం కేసులో 40 రోజులపాటు జైల్లో ఉన్నారు. తాళ్లరేవు తాహసీల్దార్ కార్యాలయం దహనం, రైల్‌రోకో సందర్భంగా గొల్లప్రోలులో రైళ్ల రాకపోకలను అడ్డగించిన కేసుల్లో నెలలు తరబడి జైల్లో ఉన్నారు. జిల్లాలోని మాదిగ సంఘాల నాయకులు శ్యాంబాబుకు నివాళులర్పించారు.

మద్యం తాగిన రత్నగిరి ఉద్యోగి సస్పెన్షన్


మద్యం తాగి ప్రసాదం కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న పసుపులేటి సుబ్బారావు

అన్నవరం: రత్నగిరిపై రవాణా విభాగం ఉద్యోగి ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇరుక్కున్న విషయం మరువక ముందే తొలి పావంచా వద్ద స్వామివారి ప్రసాదం కౌంటర్‌లో ఉద్యోగి పసుపులేటి సుబ్బారావు మద్యం తాగి విధులు నిర్వహిస్తున్నట్టు బ్రీత్ అనలైజర్ పరీక్షలో దొరికిపోయాడు. దీంతో ఈఓ వీర్ల సుబ్బారావు అతడిని సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే గురువారం రాత్రి పది గంటల సమయంలో ఒక భక్తురాలు స్వామివారి ప్రసాదం కొనుగోలు చేయడానికి ఆ కౌంటర్ వద్దకు వచ్చారు. రూ.200 ఇచ్చి ఐదు ప్యాకెట్లు ఇవ్వాలని ఆ మేరకు టోకెన్లు ఇచ్చారు. ఐదు ప్యాకెట్ల విలువ రూ.వంద పోను మిగిలిన రూ.వంద ఇవ్వాల్సి ఉండగా సదరు ఉద్యోగి ఆమెకు దురుసుగా సమాధానం ఇచ్చారు. అతని మాటతీరు, ప్రవర్తనపై ఆమె ఈఓకు ఫిర్యాదు చేశారు. ఆయన సెక్యూరిటీ గార్డులతో కలసి వచ్చి బ్రీత్ అనలైజర్ పరీక్ష చేసి మద్యం తాగినట్టు గుర్తించి సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు.

శతాధిక వృద్ధురాలి మృతి


మంగతాయారు (ఫైల్)

రాయవరం: మండలంలోని వెదురుపాకకు చెందిన శతాధిక వృద్ధురాలు పుప్పాల మంగతాయారు (103) శుక్రవారం మృతి చెందింది. ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురైన మంగతాయారు ఇంటి వద్దే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఇప్పటి వరకు మంగతాయారు తన పనులు తానే చేసుకుంటూ ఆరోగ్యంగా తిరిగేదని ఆమె మనవడు, పంచాయతీ కార్యదర్శి పుప్పాల శ్రీనివాస్ తెలిపారు. మంగతాయారుకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో శుక్రవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. గ్రామంలోని ఏలేరు కాలువలో బోర్లాపడ్డ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఆమె వయసు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహంపై లేత ఆకుపచ్చ రంగు జాకెట్టు, ముదర ఆకుపచ్చ చీర ఉన్నాయి. వీఆర్వో అప్పారావు ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో భద్రపరిచారు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ఏఎన్‌ఎంకు గాయాలు


గాయపడిన వెంకటరత్నం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రహదారిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఏఎన్ఎం ఎలిపే వెంకటరత్నం గాయాలపాలయ్యారు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు స్థానిక బైపాస్ రోడ్డులో కుళాయి చెరువు సమీపంలో గాయాలతో పడిఉన్న వెంకటరత్నంను హుటాహుటిన కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ముమ్మిడివరం: మద్యానికి బానిసైన ఓ యువకుడు భార్యతో తగువు పడి పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ మార్కెట్ ప్రాంతానికి చెందిన కోట రాము (22) గురువారం రాత్రి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రాము, సంధ్య కులాంతర వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు నాగ చైతన్య ఉన్నాడు. రాము మద్యానికి బానిసై తరచు భార్యతో గొడవపడుతూ ఉండేవాడని గురువారం రాత్రి ఇలా గొడవ పడి ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని తీవ్రంగా గాయపడ్డాడు. రాముని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవలకు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.